క్లుప్తంగా

నేడు జీవాలకు టీకాలు

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ గ్రామంలో మంగళవారం ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జూలూరుపాడు పశువైద్యాధికారి బానోత్ బద్దూలాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పశువైద్యశాల ఆధ్వర్యంలో తెల్ల పశువులు, నల్ల పశువులు, 4 నెలల దూడలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని పేర్కొన్నారు.

నేడు జూలూరుపాడుకు టార్చ్ ర్యాలీ

జూలూరుపాడు: తెలంగాణలో క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం కప్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో యువతను చైతన్య పరిచేందుకు టార్చ్ ర్యాలీని నిర్వహిస్తున్నారన్నారు. సీఎం కప్–2024ను ప్రమోట్ చేయడానికి నిర్వహించే టార్చ్ ర్యాలీ మంగళవారం ఉదయం 10 గంటలకు జూలూరుపాడు చేరుకోనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

ఎస్‌హెచ్‌ఓలకు సన్మానం



కరుణాకర్‌ను సత్కరిస్తున్న శివకుమార్

కొత్తగూడెంరూరల్: ఇటీవల వరంగల్‌లో జరిగిన జోనల్‌స్థాయి పోలీస్ మీట్ క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు, కాస్య పతకాలు సాధించిన వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.కరుణాకర్, టూటౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.రమేశ్ సోమవారం అభ్యుదయ కళా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ సత్కరించారు. కార్యక్రమంలో గిడ్ల పరంజ్యోతిరావు, కాకెలి సైమాన్, సినీ దర్శకులు సుభాకర్, ఉపాధ్యాయులు సుధాకర్, నరేందర్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: తెలంగాణ ఉద్యమకారుడు అల్లి భాస్కర్‌రావు మరణం తీరని లోటని తొలి, మలి తెలంగాణ ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య అన్నారు. కొత్తగూడెంలో సోమవారం నిర్వహించిన భాస్కరరావు సంతాప సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులు చనిపోతున్నా ప్రస్తుత ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని ఆరోపించారు. ఇకనైనా ఉద్యమకారులు, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎం.వలీబాబు, శ్రీపాద సత్యనారాయణ, కాకెల్లి సైమన్, దామరకొండ మల్లయ్య, సఫ్దార్ బేగ్, దేవులపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాయకపోడు జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్‌ప్రసాద్, దుర్గయ్య

అశ్వారావుపేట రూరల్: నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడిగా అశ్వారావుపేట మండలం వేదాంతపురం మాజీ సర్పంచ్ సోమిని శివశంకర్ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక గిరిజన భవన్‌లో నాయకపోడు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శిగా తాళ్ల దుర్గయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పసల బుచ్చయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పూసి గోవర్ధన్, బోగి వీరాస్వామి, సంగం నాగేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు రావుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారులకు సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి వార్షిక లాభాల నుంచి ప్రత్యేక ప్రోత్సాహక బహుమతిగా రూ.5 వేలను కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ సోమవారం సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్, ఏజీఎం (సివిల్) డి.వెంకటేశ్వర్లును కాంట్రాక్ట్ కార్మికులు సన్మానించారు. అంగోత్ మంగీలాల్, రబ్బాని, గురుమూర్తి, శివరామకృష్ణ, గోపి, బాలు, వెంకటేశ్, సందీప్, ప్రదీప్ కృష్ణ పాల్గొన్నారు.

వెలుగులు విరజిమ్మేదెప్పుడో?

సెంట్రల్ లైటింగ్ పనుల్లో తీవ్ర జాప్యం

- పాల్వంచలో రూ.2 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు
- నెలలు గడుస్తున్నా నత్తనడకన సాగుతున్న వైనం
- మున్సిపాలిటీ పరిధిలోని పలు రోడ్లపై అంధకారం



అల్లూరి సెంటర్ నుంచి కరకవాగు వరకు ఏర్పాటు చేస్తున్న లైటింగ్ పనులు

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో లైటింగ్ ఏర్పాటు పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత నెలలో వర్షాల కారణంగా పలుచోట్ల పనులు సగంలోనే నిలిచిపోయాయి. 22 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసే వన్‌సైడ్ లైటింగ్‌తో పాటు పలు కూడళ్లలో హైమాస్ట్ లైటింగ్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. డీఎంఎఫ్ నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన పనులు ఆలస్యమవుతున్నా అధికారులు పర్యవేక్షించకపోవడంతో పలు రహదారుల్లో అంధకారం నెలకొంటోంది.

కాంతులీననున్న కీలక సెంటర్లు

డీఎంఎఫ్ నిధులు సుమారు రూ.2 కోట్లతో అల్లూరిసెంటర్ నుంచి కరకవాగు వరకు, పాత పాల్వంచ సెంటర్ నుంచి బీఈడీ కళాశాల వరకు, కేఎస్‌పీ రోడ్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు, ఆర్‌టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి భజన మందిరం వరకు వన్‌సైడ్ లైటింగ్ పనులు చేపట్టారు. ఈ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. కానీ అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ పనులు ఆగిపోయాయి. వర్షాల కారణంగా మట్టి తీయడం ఇబ్బందికరంగా ఉండటంతో పనులను కాంట్రాక్టర్ నిలిపివేసినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగానే ఉన్నా పనులు చేపట్టకపోవడం గమనార్హం.

ఇక్కడ కూడా..

ఇదిలా ఉండగా బీసీఎం రహదారిలో డివైడర్ మధ్యలో ప్రధాన జంక్షన్లు ఉన్న ఎనిమిది చోట్ల హైమాస్ట్ లైటింగ్ పనులను సైతం చేపట్టారు. ఇందిరాకాలనీ, బస్టాండ్ వద్ద రెండు, అంబేడ్కర్‌సెంటర్, దమ్మపేటసెంటర్, పాతపాల్వంచ, నవభారత్, నటరాజ్‌సెంటర్ వద్ద పోల్స్ నిలబెట్టారు. ఆ తర్వాత లైట్ల ఏర్పాటు తదితర పనులు సైతం పెండింగ్‌లోనే ఉన్నాయి.

పలుచోట్ల అవాంతరాలు

పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే శాస్త్రి రోడ్డు, దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాస కాలనీ వరకు లైటింగ్ పనులు చేపట్టాలని అధికారులు ప్రతిపాదించారు. కానీ, శాస్త్రి రోడ్డులో ఎత్తయిన స్తంభాల ఏర్పాటుకు విద్యుత్ లైన్లు అడ్డుగా మారాయి. ఇక దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాసకాలనీ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ, మధ్యలో డివైడర్ నిర్మించాలనే ప్రతిపాదన ఉండటంతో వన్‌సైడ్ లైటింగ్ ఏర్పాటు చేసినా భవిష్యత్‌లో తొలగించాల్సి వస్తుందని పెండింగ్ పెట్టారు. ఈ నిధులను మరోచోట పనులకు వెచ్చించాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి చెందుతున్న నవభారత్ సెంటర్ నుంచి శేఖరం బంజర రోడ్డు, లేదా నవభారత్ నుంచి ఎర్రగుంట రోడ్డులో ఈ లైటింగ్ మార్చే ప్రతిపాదనలు ఉన్నాయి. ఏదిఏమైనా పట్టణంలోని కీలక సెంటర్లు, రోడ్లలో సరైన విద్యుత్ లైట్లు లేక సాయంత్రం, రాత్రి వేళ స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీలో సరైన విద్యుత్ లైట్లు లేకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనుల్లో వేగం పెరిగేలా పర్యవేక్షణ



విద్యుత్ లైట్ల ఏర్పాటు పనుల్లో జాప్యాన్ని స్వయంగా పరిశీలిస్తా. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తాను. అంతేకాక మార్పులు, చేర్పులు అవసరమైతే కూడా చేయిస్తాం.

–దాకూనాయక్, మున్సిపల్ కమిషనర్

యువత రాజకీయాల్లోకి రావాలి



మాట్లాడుతున్న అభయ్‌దీప్

కొత్తగూడెంఅర్బన్: అవినీతి రహిత సమాజం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని ఆజాద్ అధికార్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అభయ్‌దీప్ తెలిపారు. సోమవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఆజాద్ అధికార్ సేన పార్టీ విస్తరణలో భాగంగా అన్నీ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా కమిటీల ఏర్పాటు, పార్టీ కార్యాచరణ, ప్రజల్లో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ ఆదేశాలతో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా అన్యాయం, అవినీతి, అణిచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. సమావేశంలో కోరి శ్యామ్‌సుందర్, బోడికల ప్రేమ్‌దయాళ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి విద్యార్థులు

పాల్వంచరూరల్: మండలంలోని యానంబైల్‌లోని ప్రభుత్వ హైస్కూల్లో 2008 – 2009లో పదో తరగతి చదివిన 40 మంది పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన గురువులు ఫ్రాన్సిస్, వీరన్న, రామారావు, భవాని, లక్ష్మి, శరమ్మా, ఉదయశ్రీ, ప్రస్తుత హెచ్‌ఎం ప్రకాష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బుడగం రవి, బొప్పిశెట్టి హరీశ్, షేక్ అజార్, ఆవుల సాగర్, ఎదునూరి సతీశ్, దేశెట్టి వెంకటేశ్, జర్పుల జేత్రం, ముగితే భార్గవి, కట్టా కావ్య, వేల్పుల లావణ్య, నూరా రజిత, గుమ్మడి స్వప్న, తాటి కీర్తన, ఉషారాణి పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌నకు పూర్వవైభవం తేవాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సెంట్రల్ వర్క్‌షాపునకు పూర్వ వైభవం తీసుకురావాలని సెంట్రల్ వర్క్‌షాప్ ఉద్యోగులు.. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌ను కోరారు. సోమవారం ఆయన కార్మికులను కలిసేందుకు వర్క్‌షాపునకు రాగా.. కార్మికులు కలిసి మాట్లాడారు. వర్క్‌షాపులో గతంలో అన్ని రకాల వస్తువులు తయారు చేసి సింగరేణివ్యాప్తంగా ఉన్న అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లకు పంపించేవారని, నేడు ఆ పరిస్థితి లేదని, కార్మికులు చాలావరకు తగ్గారని తెలిపారు. కార్యక్రమంలో త్యాగరాజన్, ఆల్బర్ట్, పీతాంబరం, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆనాటి గుర్తులను పరిశీలించిన జీఎం



ప్రతీకలను పరిశీలిస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా 21 ఇంక్లయిన్ మూతపడగా 100 ఏళ్ల కిందట కార్మికుల ప్రతీకలను ఏర్పాటు చేయగా ఏరియా జీఎం జాన్ ఆనంద్ పరిశీలించారు. సోమవారం అధికారులు, కార్మిక సంఘాల నేతలతో కలిసి 21 ఇంక్లయిన్ మూతపడిన మైన్‌లోని కార్మికుల ప్రతీకలను పరిశీలించి మాట్లాడారు. నేటికీ చెక్కు చెదరని ఆనాటి ప్రతీకలను అక్కడి నుంచి భద్రంగా తొలగించి ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న ప్రదేశంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జీఎం వెంట రామస్వామి, జీవీ మోహన్‌రావు, రవికుమార్, నాగరాజునాయక్, అంజిరెడ్డి, సారయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సాయిబాబా మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంఅర్బన్: ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఎండీ సాధిక్‌పాషా, సింగ్ ఉపేందర్, కటికం పుల్లయ్య, ఊటుకూరు పురుషోత్తమరావు, మారపాక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

ఇల్లెందురూరల్: కానిస్టేబుల్ భూక్య సాగర్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు ప్రేమ్‌చంద్ నాయక్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాంకుడోత్ రమేశ్, భోగత్ రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పోలారం గ్రామంలో సోమవారం వారు మాట్లాడుతూ.. బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సాగర్‌ను కొంతమంది పోలీసు అధికారులు గంజాయి కేసులో అక్రమంగా ఇరికించారని, నిజాయితీ పరుడైన సాగర్ ఈ చర్యను అవమానంగా భావించి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జర్పుల మంగీలాల్, రాంచంద్రనాయక్, కృష్ణానాయక్, భూక్య నరేశ్, రామా పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

జూలూరుపాడు: ఏన్కూరుకు చెందిన కానిస్టేబుల్ భూక్యా సాగర్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి భూక్యా శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడారు. సాగర్ ఆత్మహత్యకు పోలీస్ అధికారులే కారణమని వాంగ్మూలంలో పేర్కొన్నాడని, సంబంధిత పోలీస్ అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. సాగర్ కుటుంబానికి రూ.5 కోట్లు ఆర్థిక సాయం అందించి, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

న్యాయం చేయాలి

పాల్వంచరూరల్: ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ భూక్యా సాగర్ కుటుంబానికి న్యాయం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర, జిల్లా కమిటీ నేతలు సోమవారం ఎస్పీని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం నేత బాదావత్ శ్రీను మాట్లాడుతూ.. సాగర్ భార్యకు గ్రూప్–2 స్థాయి ఉద్యోగం కల్పించాలని, పిల్లలకు ఉచిత చదువులు చెప్పించాలని కోరారు. ధరావత్ సురేశ్‌నాయక్, భూక్యా రాథోడ్ పాల్గొన్నారు.

472 మంది రైతులకు పంట నష్ట పరిహారం

పాల్వంచరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంభవించిన వరదల కారణంగా మండలంలో 363 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద 472 మంది రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చినట్లు ఏఓ శంకర్ తెలిపారు. మండల పరిధిలోని ఉల్వనూరు, దంతలబోరు, తోగ్గూడెం, రంగాపురం, నాగారం, బంద్రుగొండ, యానంబైల్ తదితర గ్రామాల్లో వరద నష్టంపై సర్వే నిర్వహించగా పత్తి, వరి, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నట్లు తేలిందని, ఈమేరకు ప్రభుత్వం ఒక ఎకరానికి రూ.10 వేల చొప్పున పంట నష్ట పరిహారాన్ని రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

ఇల్లెందు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు, పాత పెన్షన్ స్కీం అమలు కోసం దీక్ష చేస్తున్న ఓ ఉపాధ్యాయుడికి బీజేపీ సంఘీభావం ప్రకటించింది. ఆళ్లపల్లి మండలం జాకారం ఎంపీపీఎస్ హెచ్‌ఎం ఎస్‌కే మహమూద్‌పాషా 105 రోజులుగా దీక్ష చేస్తున్నట్లు వారు తెలిపారు. సోమవారం బీజేపీ నేతలు మావు నూరి మాధవ్, శాసనాల రామయ్య, రామ్మోహన్.. మహమూద్ పాషా ఇల్లెందులో సత్కరించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజ నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ: పట్టణంలోని నవభారత్ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగే పవిత్రోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఎస్.శేషాచార్యులు మాట్లాడుతూ 16వ తేదీన పురవీధుల్లో ఊరేగింపు, 17వ తేదీన పూర్ణాహుతి, నవ కలశాలకు తిరుమంజనం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బాబా ఆలయంలో పుణ్యతిథి

పట్టణంలోని పాత పాల్వంచ సాయిబాబా దేవాలయంలో పుణ్య తిథి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. షిర్డీ సాయిబాబా సమాధిలోకి వెళ్లిన రోజును పురస్కరించుకుని పుణ్యతిథి ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించారు. సోమవారం చివరి రోజు అఖండ దీపారాధన ఉద్వాసన కార్యక్రమం నిర్వహించారు. పూజారి పురాణం సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నాభిషేకం, కాగడా హారతి, ధునిపూజ నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, విమలాదేవి దంపతులు, ఆలయ చైర్మన్ వనమా రాఘవేంద్రరావు, సరోజిని దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముత్యాల కోటేశ్వరరావు, కొండం వెంకన్న, పాశం నాసరయ్య, శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, మహేందర్, కేశవ్, ప్రభాకర్, రాజేశ్వరి, సామ్రాజ్యం, శ్రీదేవి, వరలక్ష్మి, చైతన్య లక్ష్మి, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటనర్సమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ శోభాయాత్ర



ఇల్లెందురూరల్: శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్‌లో మహంకాళీ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజులపాటు కనుల పండువగా నిర్వహించారు. రోజువారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రి అమ్మవారి శోభాయాత్రను డప్పుచప్పుళ్లతో గ్రామవీధుల గుండా వైభవంగా నిర్వహించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి 7వ వార్డులో రెడ్డిబ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు వనమా రాఘవేంద్రరావు సతీసమేతంగా పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సురేందర్, పితాని సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఆ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలి



ప్రాజెక్టు ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందు/టేకులపల్లి: ఇల్లెందు మండలంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న ఎల్‌ఎస్‌ఎన్ ఓబీ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని పలువురు డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులోని సింగరేణి ఏరియా కార్యాలయంలో డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, కోయగూడెంలో ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాసరావుకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు లక్కినేని సురేందర్‌రావు, భూక్యా దశ్‌సింగ్‌నాయక్, దుబాకుల ప్రసాద్, ధర్మపురి వీరబ్రహ్మాచారి, మాలోత్ శివనాయక్, బొమ్మెర్ల వరప్రసాద్, భూక్యా హరీజ్య మాట్లాడారు. వేతనాలు సక్రమంగా చెల్లించకపోతే జీతం నుంచి మినహాయించుకునే ఈపీఎఫ్‌ను ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కల్తీ వెంకటేశ్వర్లు చీమల సత్యనారాయణ డి.కృష్ణ, బి.ఈర్యా, జర్పుల సురేందర్, కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, ఎస్కే యాకూబ్‌షావలీ, పాయం వెంకటేశ్వర్లు, బి.రాంసింగ్, రాందాస్ పాల్గొన్నారు.

కేటీసీ కార్మికులకు బోనస్ చెల్లించాలి

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులోని ఎల్‌ఎస్‌ఎన్ కంపెనీలో ఓబీ, కోల్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి ఇచ్చే బోనస్ రూ.5 వేలు, ఎల్‌ఎస్‌ఎన్ ఇచ్చే బోనస్ వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోరం సురేందర్ డిమాండ్ చేశారు. సోమవారం నాయకులతో కలిసి కేటీపీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాసరావుని కలిసి కాంట్రాక్టు కార్మికుల బోనస్ గురించి చర్చించారు. సింగరేణి ఇచ్చే బోనస్ అర్హత ఉన్న ప్రతి కార్మికుడికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అందరి సమక్షంలో ఎల్‌ఎస్‌ఎన్ మేనేజర్ రాజమోహన్‌రెడ్డితో పీఓ మాట్లాడగా సింగరేణి బోనస్ డబ్బులు రెండు రోజుల్లో కార్మికుల ఖాతాల్లో జమ చేస్తానని, తమ ద్వారా వచ్చే బోనస్‌ను కూడా చెల్లించేలా చూస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో ముచ్చ సుధాకర్, భూక్యా సర్దార్, మోకాళ్ల పోషాలు తదితరులు పాల్గొన్నారు.

గది నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జడ్జి భానుమతి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కోర్టు ప్రాంగణంలో అకౌంటెంట్ గది నిర్మాణానికి సీనియర్ సివిల్ జడ్జి గొల్లపూడి భానుమతి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ అకౌంటెంట్ రూం ప్రత్యేకంగా ఉండేందుకు నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాదులు అనుబ్రోలు రాంప్రసాద్‌రావు, జనపరెడ్డి గోపీకృష్ణ, పిసరమల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా గౌడ సంఘం ఎన్నికలు

సమాన ఓట్లతో చెరో ఏడాది అధ్యక్ష పదవి



యాకయ్య



శ్రీను

ఇల్లెందురూరల్: మండలంలోని ముకుందాపురం గౌడ సంఘం అధ్యక్ష ఎన్నికలు సోమవారం హోరాహోరీగా సాగాయి. కుల పెద్దలు కొత్త వెంకటేశ్వర్లు, వల్లాల రాజయ్య, మండ శంకర్, గట్టు కోటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో ఐలి యాకయ్య, పబ్బు శ్రీను అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. అయితే, 136 మంది ఓటు వేయగా, ఇద్దరికీ సమానంగా 68 చొప్పున ఓట్లు వచ్చాయి. దీంతో కుల పెద్దలు చెరో ఏడాది అధ్యక్షుడిగా వ్యవహరించాలని సూచించి టాస్ ద్వారా తొలి ఏడాది పబ్బు శ్రీను, రెండో ఏడాది ఐలి యాకయ్య అధ్యక్ష పదవి నిర్వర్తించాలని ఖరారు చేశారు. కార్యక్రమంలో మండ దుర్గారావు, గట్టు శ్రీను, కుర్ర పెద్దశ్రీను, వీరగోని కుమారస్వామి, పబ్బు సత్యం, అయిలు నారాయణ, అయిలు శ్రీను, కొత్త యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న సాబీర్‌పాషా, నాయకులు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు అప్పికట్ల సుధాకర్ మృతికి ఆ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. సోమవారం సుధాకర్ దశదిన కర్మ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా హాజరయ్యారు. సుధాకర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, భూక్యా దస్రు, జక్కుల రాములు, గణేశ్, యల్లంకి మధు, యాసా రోశయ్య, ఎస్కే చాంద్‌పాషా, ఊడల సుధా, అప్పికట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.